
# తల్లీ వీళ్ళమ్మా నీ బిడ్డలు!...



అది ఒక రైలు.

ఆ రైలు పేరు కృష్ణాఎక్స్‌ప్రెస్.

అలనాడు కృష్ణుడు పదహారువేల మంది గోపికలతో రాస క్రీడలు!... ఆయన పేరుమీద వెలిసిన ఆ రైల్లో అంతకు రెట్టింపు మనస్తత్వాల లీలలు!–

అడుక్కొని తినేవాళ్ళకు... పేకాడుకొనేవాళ్ళకు...కాలుమీద కాలేసుకొని కమ్మని ఊహల్లో తేలిపోతున్నవాళ్ళకు...కడుపులో బాధను కండ్ల నుండి బయటికి నెట్టలేక లోలోల కుములుతున్న వాళ్ళకు...గతాన్ని తలపోస్తున్న వాళ్ళకు... భావికలల్లో తేలిపోతున్న వాళ్ళకు...జల్సాగా జర్దాకిళ్ళీ నములుతున్న వాళ్ళకు...కాఫీ టీలు అమ్ముతున్న వాళ్ళకు...సీట్లకోసం కొట్లాడుకొంటున్న వాళ్ళకు...రాజకీయాల్ని రంజుగా మాట్లాడుకొంటున్నవాళ్ళకు– అందకీ తరతమబేధాలు లేకుండా ఆశ్రయమిచ్చి సమసమాజానికి అద్దం పడ్తూ ఉంది!

ఆ కృష్ణాఎక్స్‌ప్రెస్ తిరుపతి ప్లాట్‌ఫారం నుండి బయలుదేరడానికి సిద్ధమవుతుండగా–

చామనచాయవాడు...తెలతెల్లని ఖద్దరుదుస్తులవాడు... ఆజానుబాహువు పెద్దగా మూటా ముల్లె చేతలేనివాడు– రైలెక్కాడు.

రైలెక్కిన ఆరూపానికొక పేరుంది... ఆ రైలు కున్నట్లే!

అతనిపేరు సౌజన్యమూర్తి.

రైలెక్కిన సౌజన్యమూర్తి ఒకసీటు ముందు నిలబడి కన్నుల్లో అభ్యర్థన పెదాలపై చిరునవ్వు పూయించి నలుగురు కూర్చోవలసిన సీట్లో కాళ్ళు నిగడదన్ని కూర్చున్న ఇద్దరివైపు చాలా సౌమ్యంగా చూశాడు.

రెండు మూడు నిముషాల వరకు సౌజన్యమూర్తి సౌమ్యాన్ని ఖాతరు చెయ్యని ఆ ఇద్దరు నాలుగో నిముషంలో బుద్ధిగా ఒంటిని దానికి అతుక్కొన్న రెండు కాళ్ళను స్వాధీనానికి తెచ్చుకొని బటువుగా కూర్చున్నారు. ఖద్దరు దుస్తుల్ని చూసి కలవరపడ్డారో? లేదా– చిరునవ్వు ధాటికి చిత్తయిపోయారో? వాళ్ళకే తెలియాలి మరి?– వాళ్ళు సర్దుకొని కూర్చున్నమాట మాత్రంవాస్తవం.

సౌజన్యమూర్తి చూపుల్తోనే వాళ్ళకు కృతజ్ఞతలు తెలిపాడు. వాళ్ళు ఖాళీచేసిన సీటులో కుదురుగా కూర్చున్నాడు– తన పక్కన్నే మరొక వ్యక్తికి చోటు వదిలిపెట్టి!– 'ఇదీ పద్ధతి!' అని వాళ్ళకి చూపెట్టినట్లుగా. చూసీ చూడనట్లుగానే వాళ్ళది గమనించారు. మరింత వొదిగి కూర్చొని తమ సంస్కారాన్ని ప్రదర్శించారు.

సౌజన్యమూర్తి సన్నగా నవ్వుకొన్నాడు.

ప్లాట్‌ఫారం మీద తొందరతొందరగా అటుయిటు తిరుగుతున్న కొన్ని శాల్తీలు... ఆ తొందరపాటులో ఒకర్నొకరు ఢీ కొనగా సారీలు ... సాగనంపలేక సాగనంపుతున్న శారీలు... ఈగలతో వియ్యమందుతున్న రాత్రిమిగిలిన ఇడ్లీలు...తోడుగా పూరీలు!...సామాన్లని మోసుకొనిపోతున్న ట్రాలీలు...కూలీలు...!

హడావిడి! ప్లాట్‌ఫారమంతా ఒకటే హడావిడి!!–

ఆ హడావిడిలో అంతకంటే హడావిడిగా ఆ గుంపును అతిసునాయాసంగా చీల్చుకొని వచ్చి రైలెక్కాడొక ఘనుడు! ఆ సందర్భంలో నిజంగా అతడు అభినవ అభిమన్యుడే!

ఆ అభిమన్యుడు అయిదడుగుల పైబడి ఆరడుగులకు లోబడి ఉంటాడు. కనుముక్కు తీరు చూడముచ్చటగా ఉంది. ఎత్తుకుతగిన లావు లావుతగిన ఎత్తు... ఉంగరాలు తిరిగిన వత్తయిన జుట్టు... నిమ్మపండులా నిగనిగలాడే రంగుకు దిష్టితీసినట్లుగా ఈ చెంపకంత, ఆ చెంపకంత మసిపూసినట్లుగా పల్చగా పెరిగిన గడ్డం...చేతిలో ఒక సూట్‌కేస్–మంచి చలాకీ కుర్రవాడని చెప్పవలసిందేకానీ అప్పటి అతని తీరుచూస్తే అలా చెప్పడానికి వీల్లేదు.

అంత హడావిడిగా రైలెక్కిన అభిమన్యుడు ఆ పెట్టెలో నింపాదిగా నిలబడి పెట్టంతా ఎవరికోసమో వెదుకుతున్నట్లు కలయచూసి 'పెట్టంతా వెదుకుతుంటే నువ్విక్కడేవున్నావా

మహానుభావా? అన్నట్లుగా గబగబా వచ్చి సౌజన్యమూర్తి పక్కన తనకోసమే ఎదురు చూస్తున్నట్లున్న ఆ సీటులో కూర్చున్నాడు. సౌజన్యమూర్తి ఇదంతా గమనించే స్థితిలోలేడు. అప్పటికే ఆయన ఒకపత్రికలో తలదూర్చేశాడు.

అభిమన్యుడు అసలుసిసలైన తెలుగువాడు!

"ఎలా చెప్పగలుగుతున్నావ్? ఈరోజుల్లో వేషాన్ని బట్టి జాతిని నిర్ణయించడం అంత సులభమైన పనిగాదే?" అని అడిగితే- సౌజన్యమూర్తి పక్కన్నే ఆశీనుడైన అభిన్యుడు వేస్తున్న సీనుచూస్తే ఎవరైనా చెప్తారు.

సౌజన్యమూర్తి చదువుతున్న పత్రికలోకి అతడు తొంగితొంగి చూస్తున్నాడు.

ఒక్క తెలుగువాడే ఆపని చేయగలడు! అలా చేయడానికి సమర్థుడుకూడా!

ఆ క్షణంలో సౌజన్యమూర్తి మొగంలో సౌమ్యం పటాపంచలయింది. నేత్రాలు అగ్నిగోళాలయ్యాయి. మొగం జేవురించింది. ఒక్క సారి తలపైకెత్తి అభిమన్యుడివైపు తీక్షణంగా చూశాడు.

ఒక్కక్షణం అభిమన్యుడు తెల్లమొగంవేసి అంతలోనే తెపురుకొన్నాడు.

"సార్! ఈపత్రిక పబ్లిషర్ మీఫ్రెండా సార్!"

ఇప్పుడు తేలమొగం వేయడం సౌజన్యమూర్తి వంతయింది.

"లేకుంటే మీకెందుకుసార్ అంత బాధ" నేనొక పత్రికకొనకుండా మీరుకొన్న పత్రికనే చదివేస్తే... మీ ఫ్రెండ్‌కింకొక కాపీ అమ్ముడుపోదనీ, అది ఆయనకు తీరని నష్టమనీ బాధపడ్తున్నారా? అదే కదాసార్ మీ కోపానికికారణం?"

అభిమన్యుడితోపాటే కాస్తవెనకా ముందుగా ఇంకొక కుర్రవాడు కూడా రైలెక్కాడు. వాడు దాదాపు అదే వయస్సులో ఉంటాడు. ఇద్దర్నీ పక్కపక్కన్నే నిలబెడ్తే ఒకకాడికిగట్టిన కోడెదూడల్లా దిట్టంగా ఉంటారు. అతడి చేతిలోకూడా ఒక సూట్‌కేస్ ఉంది. అభిమన్యుడు కూర్చొని ఉంటే అతని పక్కన్నే నిలబడుకొన్నాడు.

అభిమన్యుడి మాటతో ఆ కుర్రవాడు పకపక నవ్వాడు.

సౌజన్యమూర్తికి అరికాలిమంట నెత్తికెక్కింది.

"అదిగాదు బాబూ! ఒకరు చదువుతున్న పత్రికలో ఇంకొకరు తొంగితొంగి చూసి చదవడం అనాగరికం!" అన్నాడు.

"పొద్దున్నేలేచి ఎవరిమొకం చూసినాన్నాతండ్రీ! అనాగరికుడని మాట పడ్తున్నానే! సారీ సార్! ఈ సూట్‌కేస్ కాస్త చూస్తూ ఉండండి. నేనూ ఒకపత్రిక కొనుక్కొని వస్తా- పాపం నావల్ల మీఫ్రెండ్ కెందుకులే ఇంత లాస్!" అని అంటూ అతని సమాధానం కోసం కూడా ఎదురుచూడకుండా సూట్‌కేస్ అక్కడేపెట్టి అభిమన్యుడు హడావిడిగా పరుగెత్తాడు! అభిమన్యుడు లేస్తూనే ఆసీట్లో పక్కన నిల్చుకొన్న కుర్రవాడు కూర్చున్నాడు.

సౌజన్యమూర్తి ఇవన్నీ తనకేమీ పట్టనట్లుగా దృష్టిని పత్రికమీద కేంద్రీకరించాడు.

గంట గణగణ మోగింది!

తిరుపతి నుండి విజయవాడ మీదుగా హైదరాబాద్ వెళ్ళే 'కృష్ణాఎక్స్‌ప్రెస్' నెంబరు నాలుగో ప్లాట్‌ఫారం నుండి బయలుదేరుటకు సిద్ధంగా ఉన్నది."– అన్న ప్రకటన అన్ని భాషల్లోకి మారుతుంటే స్టేషన్ మారుమోగుతూ ఉంది. దేవస్థానం రెండవ సత్రంలో ధర్మ సంస్థాపనార్థం యుగయుగంలో అవతారాలెత్తుతున్న అవతార పురుషుడు గీతోపదేశం చేస్తున్నాడు– కీర్తిశేషులు ఘంటసాల గొంతులో నుండి. ఇటువైపు స్టేషన్‌లో ప్రకటన, అటువైపు సత్రంలో గీతోపదేశం మధ్య కృష్ణాఎక్స్‌ప్రెస్‌లో ప్రజలు గోల!–

'ఎవరు చేసిన కర్మ వాళ్ళనుభవింపక తప్పదన్నా!' అని తత్త్వాన్ని పాడుకొంటూ ఒక బిచ్చగాడు ప్లాట్‌ఫారం మీద అడుక్కొంటూ!...

అభిమన్యుడు ఇంకా రాలేదు.

గార్డు ఈల వేస్తున్నాడు.

అయినా అభిమన్యుడి జాడలేదు.

"అరే ఇడియట్! ఉన్నంతసేపు ఉండి ఇప్పుడు దిగిపోయ్‌నాడే? బోడి పత్రిక! చదవకపోతే ఇప్పుడేఁవన్నా కొంపలంటక పోబోతాయా? ఒకవేళ అట్లంటకపోయ్యేటట్టుగా ఉంటే ఇంకొక స్టేషన్‌లో కొనుక్కోవచ్చుగదా? ఇప్పుడేం చెయ్యాలబ్బా?" అని గుణిసినట్లే గుణిసి రెండు చేతుల్తో రెండు సూట్‌కేస్‌లు పట్టుకొని గుట్టుగా దిగిపోయాడు.

పత్రికను అడ్డంపెట్టుకొని ఆ కుర్రవాడు విసిరిన విసుర్లకు సౌజన్యమూర్తి 'ఒకరికి మించిన స్నేహితుడింకొకరుగా ఉన్నారే!' అని తనలో తాననుకొని సన్నగా నవ్వుకొన్నాడు కూడా!–

రైలు బయలుదేరింది. బయలుదేరిన బండి వేగాన్ని పుంజుకొంటూ ఉంది. ఇంక కొన్ని క్షణాల్లో ఆ పెట్టె ప్లాట్‌ఫారాన్ని దాటేస్తుంది కూడా. అప్పుడు ఎక్కడ నుండి వచ్చాడో? మెరపుతీగలా వచ్చి పెట్టెకు బిగించినకమ్మిని ఆధారం చేసుకొని ఒక్క లగువులో ఎగిరి రైలు పెట్టెలోకి దూకాడు. ఆపెట్టెలో అందరి కళ్ళు జిగేల్ మన్నాయి. జిగేల్ మన్న కళ్ళని స్వాధీనానికి తెచ్చుకొని అతని సాహసానికి ముక్కుమీద వేలేసుకొని ఆపై 'ఎంత పన్జేసినావయ్యా! ఈ బండి కాకుంటే ఇంకొక బండి అవుతుంది. పోయిన ప్రాణం రమ్మంటే వస్తుందా? ఏ మాత్రం కాలో చెయ్యో జారుంటే!– ఏమయ్యేది గతి?–' అని మందలించారు. ఆ మందలింపులో అభిమానం ఉంది.

అభిమన్యుడు పద్మవ్యూహం నుండి బయటపడినంత ఠీవిగా పోజుపెట్టి దర్జాగా నిలబడ్డాడు. జేబులోనుండి చేతి రుమాల్ని అందుకొన్నాడు. నొసట పట్టిన చెమటను తుడుచుకొన్నాడు. గస ఆర్చుకొన్నాడు. ఆ మీదట వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు. చేతిలో పత్రికను విసనకర్ర చేసి విసురుకొంటూ చుట్టుపక్కల కలయ చూశాడు. చూస్తూ తనసీటు పక్కకు దృష్టిని మరల్చాడు. 'సార్! నా సూట్‌కేస్ సార్!' అంటూ ఒక్క పొలికేక పెట్టాడు.

ఆ అరుపుకు అదిరిపడి సౌజన్యమూర్తి అసహనంగా అతనివైపు చూశాడు.

"అదేంవిటి సార్? అలా చూస్తున్నారు సార్!... నా సూట్‌కేస్‌ను చూస్తూ ఉండమని మీతో చెప్పేగదసార్ నేను వెళ్ళింది."

"అవునయ్యా! ఇప్పుడు నేనేం కాదంటున్నానా? నీ సూట్‌కేస్‌ను నేను చూస్తూనే ఉన్నాను. చూస్తూ చూస్తూ ఉండగానే నీ మిత్రుడు నువ్వు రాలేదని నిన్ను తిడ్తూ సూట్‌కేసుల్ని రెండు చేతుల్తో పట్టుకొని నిన్ను వెదుక్కొంటూ వెళ్ళిపోతే నన్నేంచెయ్యమంటావ్?"

"నా మిత్రుడా! వాడెవుడు సార్!"

"నీతోకల్సి రైలెక్కి నీ పక్కన్నే నిలబడి నీమాటకు నవ్వుతూ నువ్వు లేస్తూనే నీ సీట్లో కూర్చున్నాడే!... అతడేనయ్యా!"

"సార్! వాడెవుడో నాకు తెలియదుసార్! వాడు నా ఫ్రెండూకాదు. పాడూకాదు. దొంగ లమ్డీకొడుకు! బలే నాటకమాడాడే! కొంప మునిగిందిగద నాయనోయ్!" అని అంటూ అభిమన్యుడు అతి దీనాతిదీనంగా లేచి నిలబడి పెట్టెంతా కలయచూస్తున్నాడు.

ఆ పెట్టెలోని వాళ్ళంతా 'అయ్యో పాపం' అని సానుభూతి ప్రకటిస్తున్నారు.

సౌజన్యమూర్తి గుండెల్లో రాయిపడింది.

"పత్రిక కొనుక్కొనివస్తానని మీతో చెప్పే కదసార్ నేను వెళ్ళింది. అంతవరకు నా సూట్‌కేస్ చూస్తావుండమని అడిగాను కదసార్! వాడెవుడో దొంగముండాకొడుకు నాటకమాడ్తే మాటవరసకైనా ఒక్కమాట అడక్కూడదా సార్! ఇప్పుడు నాగతేం కావాలసార్. నా సర్టిఫికెట్లు... డబ్బులు...గుడ్డలు– అన్నీ అందులోనే ఉన్నాయిగద సార్!" అభిమన్యుడి గొంతు ఆపై పెగలలేనట్లు పూడకపోయింది.

"నువ్వు చెప్పినావు నిజమేనయ్యా! నీ సూట్‌కేస్‌ను నేను చూసుకుంటూ ఉంటాను. నువ్వు వెళ్ళిరా బాబూ! అని నేనేమైనా నీకు హామీయిచ్చానా? లేదే? మరి అనవసరంగా నింద నా మీదెందుకు మోపుతావ్?" అని సౌజన్యమూర్తి తిప్పి కొట్టడానికి అవకాశముంది. అయితే సౌజన్యమూర్తి అలాంటి మనిషికాదు.

చీమను చంపితే 'శివ!శివా!' అని కండ్లు మూసుకొంటాడు.

నల్లిని నలిపితే 'నారాయణ! నారాయణా!' అని నారాయణుని నామస్మరణ చేస్తాడు.

బోనులో పడిన ఎలుకనుచూస్తే అతని మనకు విలవిలలాడి పోతుంది.

ఇక ఎదుటిమనిషి ఏడుపువింటే చెప్పాలా?

బదులు చెప్పకుండా... అ పరిస్థితుల్లో ఏమి చెయ్యాలో తోచకుండా... ఏడుపు మొగం పెట్టిన అభిమన్యుణ్ణి ఎలా సముదాయించాలో తెలియకుండా సౌజన్యమూర్తి సతమతమైపోతూంటే రైలు రేణిగుంటలో ఆగింది.

రైలు ఆగిఆగడంతోటే సౌజన్యమూర్తి సౌజన్యాన్నంతా తీసి మూటగట్టి సీటుమీద పెట్టి ఆదరాబాదరా పైకి లేచాడు. ఆ పెట్టెలో మరొక ముగ్గురు నలుగురు సహృదయులు అతనికి తోడయ్యారు. అందరు కలిసి అభిమన్యుణ్ణి వెంటబెట్టుకొని ప్లాట్‌ఫారం ఈచివరనుంచి ఆ చివరివరకు ఆ చివరినుండి ఈచివరివరకు పెట్టెపెట్టెను పనిగట్టుకొని వెదికారు.

వెదికితే ఏమయింది?

శ్రమ మిగిలిందికానీ ఫలితం దక్కలేదు.

తల తిరిగి నోటివద్దకు వచ్చినట్లుగ అందరు మళ్ళీ బయల్దేరినచోటుకే చేరుకొన్నారు. ఉసూరుమంటూ ఎవరి సీట్లోల్లో వాళ్ళు కూర్చున్నారు.

రేణిగుంట నుండి రైలు బయల్దేరింది.

"సార్! ఆపెట్టెలో డబ్బుందిసార్!...పోతేపొయ్యింది సార్. రెండే రెండు జతల కొత్త బట్టలున్నాయిసార్!... అవిగూడా పోతేపొయ్యాయిసార్! కానీ సార్! నా సర్టిఫికెట్లు సార్!– నా బతుక్కే ఆధారాలైన సర్టిఫికెట్లు పోయాయిగద సార్! ఇంకేం చెయ్యాలిసార్?"

పాపం! అభిమన్యుడి మొగాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

సౌజన్యమూర్తి అతని దుఃఖాన్ని చూడలేక మెలికలు తిరిగిపోతున్నాడు.

"సార్! నా తండ్రి ఆర్డినరీ స్కూల్ టీచర్! నా తర్వాత ముగ్గురూ ఆడపిల్లలే సార్! నన్ను యం.ఎ., వరకు చదివించడానికి ఆయన పడిన పాట్లు చెప్పుకోలేను సార్! నా తర్వాతది బి.ఎ. చదివింది. దానికి ఉద్యోగం దొరకలేదు సార్. అడిగినంతకట్నం ఇవ్వలేని కారణంగా పెండ్లీ కాలేదు. నాకైనా ఉద్యోగం వస్తే ఆ సంసారం చన్నీళ్ళకు వేన్నీళ్ళుగా సాగిపోతుందని రాయని పరీక్షలేదు. వెళ్ళని ఇంటర్వ్యూలేదు. అయినా నాబోటి టీచర్‌కొడుక్కి ఎవురిస్తారు సార్ ఉద్యోగం? ఇప్పుడు కూడా తిరుపతి దేవస్థానంలో ఒక ఇంటర్వ్యూ వచ్చింది. ఇన్నాళ్ళకు ఆ ఏడుకొండలవాడు దయదలచాడని ఉద్యోగం వచ్చేసినంత ఉత్సాహంతో వస్తే తీరా అక్కడికి వెళ్తే అది రిజర్వుకోటాకు కేటాయించారట. ఏ హరిజనుడుగానో గిరిజనుడుగానో పుట్టుంటే బాగుండేదిసార్. ఉట్టికీ స్వర్గానికి కూడా కాకుండా అల్లాడి పోతుంటే మూలిగే నక్కమీద తాటిపండు పడినట్లు ఇదొకటాసార్ నాబతుక్కి?..."

అభిమన్యుడు 'అలో రామచంద్రా!' అని అలమటిస్తున్నాడు.

సౌజన్యమూర్తికి కడుపులో చెయ్యేసి దేవినట్లుంది. తన అజాగ్రత్తవల్లనే పాపం! ఆ పిల్లవాడి సూట్‌కేస్ పోయిందని అంతరాత్మ ఘోషిస్తూ ఉంది.

"నన్ను క్షమించుబాబూ! ఆ కుర్రవాడు నీస్నేహితుడన్న అభిప్రాయంతో నేను మోసపోయాను. పోనీ! కొంతశ్రమపడ్తే పోయిన సర్టిఫికెట్లకు డూప్లికేట్లు సంపాదించుకో వచ్చుగదా?"

"నిజంచేసనుకోండిసార్. ఈ రోజుల్లో పరిస్థితుల మీకు తెలియవా సార్. డూప్లికేట్‌లు సంపాదించాలంటే మాటలా? ఎంతమంది కాళ్ళుపట్టాలో. ఎంతడబ్బు ఖర్చుపెట్టాలో?– మీకు వేరేచెప్పాలాసార్. ఈ దేవస్థానానికి అప్లికేషన్ పెడ్తూంటే సార్– తాసీల్దార్ దగ్గర కేస్ట్ సర్టిఫికెట్ తీసి జతపరచమన్నారు. హైస్కూల్లో చదివాను. కాలేజీలో చదివాను. ఆ సర్టిఫికెట్లలో నాకులం రికార్ట్‌చేసి ఉన్నారుకద సార్. మళ్ళీ తాసీల్దారు దగ్గరెందుకు కేస్ట్ సర్టిఫికెట్? మీరే చెప్పండి. బడిలోచేరే ప్రతిస్టూడెంట్ కేస్ట్ సర్టిఫికెట్ తాసీల్దార్ దగ్గర తీసియివ్వాల్సిందేనట. ఇదేం విడ్డూరం సార్? పోనీ! అక్కడైనా ముందు వచ్చినవాడు ముందు. వెనక వచ్చినవాడు వెనక– అన్న నియమమైనా ఉంటే ఫరవాలేదు. అదేమీలేదు. ముడుపుచెల్లిస్తే మూడునిమిషాలు. లేకుంటే మూడుదినాలు. ఈ సందులో పరపతి కలిగిన పెద్దమనుషులు దూరి గద్దల్లాతన్నుకు పోతూంటే చూస్తూ నోర్మూసుకోవలసిందే! నిలదీసి అడగదామనుకొంటే నక్సలైట్ అంటారు. ఈ పరిస్థితుల్లో డూప్లికేట్‌లు సంపాదించమంటే మాటలాసార్?"

"పాపం! కుర్రవాడు బాగా చదువుకొన్నవాడు. మంచి తెలివైనవాడు. చదివిన చదువుకు తగిన ఉద్యోగం వచ్చివుంటే ఈ బాధలుండేవి కావు. ఈ వ్యవస్థలో ఎక్కడికెళ్ళినా ఎదురుదెబ్బలు తప్పవు. ఈ దెబ్బలు తినితిని మంచి అనుభవాన్ని కూడా గడించాడు. నిజమేకదా! ఈ కేస్ట్‌సర్టిఫికెట్ల గొడవ ఎప్పుడు తీరుతుందో! ఈ దేశం ఎప్పుడు బాగుపడ్తుందో? 'నేను భారతీయుణ్ణి!' అని రాసుకొనే స్థితికి ఎప్పుడు ఎదుగుతుందో? పాఠశాలల్లో అడుగుపెట్టేటప్పుడే కాపు, కమ్మ, ఎరుకల, యానాది, మాలమాదిగ అని లేతబుర్రల్లో రాసేస్తుంటే ఈ వర్ణవ్యవస్థ మారుతుందా? కుర్రవాడైనా గొప్పగా ఆలోచిస్తున్నాడు. అవునుమరి? అనుభవమే కదా మనిషికి అసలైన ఉపాధ్యాయుడు." అని సౌజన్యమూర్తి ఆలోచిస్తుంటే అతని ముఖ కవళికలు మారుతున్నాయి. కన్నుల్లో కరుణ చోటు చేసుకొంటూ ఉంది.

అభిమన్యుడు ఆ మార్పును పసికట్టాడు.

"సార్! చెప్పకూడదుకానీ ఈ ఇంటర్వ్యూకు బయలుదేరుతుంటే–సార్! నాతల్లి మెడలో పసుపుకొమ్ము కట్టుకొని నాతండ్రి అగ్నిసాక్షిగా కట్టిన తాళిబొట్టును నా చేతికిచ్చింది. నా భవిష్యత్తుకోసరం నాతల్లి మంగళసూత్రాన్ని ఈపాడుచేతుల్తో అమ్ముకొన్న దురదృష్టవంతుణ్ణి సార్! దురదృష్టవంతుణ్ణి!"

ఈ మాటల్ని చెప్పలేకచెప్పి అభిమన్యుడు కుమిలికుమిలి ఏడుస్తున్నాడు.

సౌజన్యమూర్తి గుండెల్ని ఎవరో పిడికిలితోపట్టి పిండుతున్నట్లుంది. కూర్చోలేక లేచినిలబడలేక సీటుపొందక మనిషి విలవిలలాడి పోతున్నాడు.

అభిమన్యుడికి అతని బాధ అర్థమవుతూనే ఉంది. ఈ లోకంలో అర్థంచేసుకో గలిగినవాళ్ళు దొరకాలేకానీ– దొరికితే ఎవరుమాత్రం విడిచిపెడ్తారు.

"సార్! మాబోటి పేదోళ్ళ మీద ఆ దేవుడికిక్కూడా దయ లేదు సార్! తాళిబొట్టు చేతికిస్తూ నా తల్లి ఏమనిందో తెలుసా సార్? 'ఒరే నాయనా! ఆదేవుడి దగ్గరికిపోతున్నావ్. తాళిబొట్టును

అమ్మి డబ్బును జాగ్రత్తగా వాడుకో. మిగిలింది ఆ దేవుడి హుండీలో వెయ్యి!' అనింది. ఈ మాటకూడా ఆ దేవుడి చెవుల్లో దూరలేదు గదసార్?"

"ఇంతగా చెబుతూంటే నీ చెవుల్లోకూడా దూరలేదా?" అని నిలదీసి అడుగుతున్నట్లనిపించింది. నిబ్బరించుకోలేక పోయాడు. గుండెబరువు కుంగదీస్తూంటే మెల్లగా పైకి లేచాడు. జేబులో చేయిపెట్టి యాభైరూపాయలనోటు చేతపట్టుకొన్నాడు. పెట్టెను ఒక్కసారి కలయచూశాడు.

రైలు అగమేఘాలమీద పోతూనే ఉంది.

ఇంత వరకు లోకాన్ని వేధించిన చీకటివాత మట్టిగొట్టి వెలుగు వెల్లివిరియబోతున్నది. తూర్పుదిక్కున తెలిరేకలు విచ్చుకొంటున్నాయి. శ్రీకాళహస్తీశ్వరుని ఆలయగోపురాలు బంగారు కాంతుల్ని సంతరించుకొని భాసిస్తున్నాయి. ఆ గోపురాల మీద ఎగిరేపావురాలు 'ఈ ప్రకృతి రామణీయతను అస్వాదించండి' అని ఆహ్వానాలు పలుకుతున్నట్లున్నాయి. ఈ లాంటి ఎన్ని మనోహర దృశ్యాల్ని ఈ లౌకిక లంపటాలు నిర్దాక్షిణ్యంగా మింగేస్తున్నాయో?–

కృష్ణా ఎక్స్‌ప్రెస్ శ్రీకాళహస్తిని దాటేసింది.

రైలు ముందుకు దూసుకొని పోతున్నది. తన సీటులో నుండిలేచి నిలబడిన సౌజన్యమూర్తి అడుగు ముందుకు వెయ్యలేకపోతున్నాడు. కర్తవ్యం ముందుకు లాగుతూ ఉంది. అభిమానం అడ్డుపడ్తూ ఉంది. అయినా తప్పదు. తనఎదురు సీట్లో నెమ్మదిగా కూర్చొని ఈ జరిగినదంతా శ్రద్ధగా ఆలకిస్తున్నాడు ఒక పెద్దమనిషి.

సౌజన్యమూర్తి ఆయన ముందు నిలబడ్డాడు.

"ఏవండీ? కుర్రవాడు బాగా చదువుకొన్నాడు. చదువుకుతగిన తెలివితేటలుకూడా ఉన్నాయి. తన సూట్‌కేస్‌ను నన్ను చూస్తూ ఉండమన్నాడు. నా పొరబాటు వల్లనే అతని సూట్‌కేస్ పోయింది. పోగొట్టుకొన్నంత ఇవ్వలేకపోయినా ఉడతాభక్తిగా పోగయినంత మట్టుకు ఇవ్వాలనుకొన్నాను. నా మట్టుకు నేనొక యాభై రూపాయలిస్తున్నాను. మీరు.." అని అర్థోక్తిలో ఆగాడు మూర్తి.

ఆ పెద్దమనిషి మారు పలక్కుండా పది రూపాయలు ఇచ్చాడు.

సౌజన్యమూర్తి సార్థకనామధేయుడు. ఆముఖాన్ని ఒక్కసారి చూస్తే చూపుల్ని తిప్పుకోవడానికి కాసేపు పడుతుంది. ఆ కన్నుల్లో ఆకట్టుకొనే ఆకర్షణ...సన్నని పెదాలపై అసాధారణమైన చిరునవ్వు– ఎదుట నిలబడ్తే ఎంతటి వాడైనా అతని మాటను కాదనడం అంత తేలిక కాదు.

ఈ వసూళ్ళు జరుగుతూ ఉంటే అభిమన్యుడు వంచిన తలెత్తలేదు.

రైలు వెంకటగిరి సంస్థానాన్నిదాటి పోతున్నది. ఆ పెట్టెలో ఒక్కర్నీ వదిలిపెట్టలేదు– అని నిర్ధారించుకొన్న తరువాత సౌజన్యమూర్తి వచ్చి తన సీట్లోలో కూర్చున్నాడు. వసూలైంది ఓపిగ్గా లెక్క పెట్టాడు.

నూట యాభై రూపాయల యాభై పైసలున్నాయ్!

గూడూరులో రైలు ఆగింది.

"బాబూ! ఇది నేను చేసినతప్పుకు ప్రాయశ్చిత్తం కాదు కానీ, ఆపదలోవున్న మనిషిని సాటి మనిషిగా ఆదుకోవడం మాత్రమే! ఈ చిన్నమొత్తం నీ నెత్తిమీదున్న పెద్ద బాధ్యతల్ని దించేస్తుందని కూడా నేను అనుకోవడంలేదు. ఈ పెట్టెలో ప్రయాణంచేస్తున్న వాళ్ళందరి సహృదయతకు నిదర్శనం ఈ సహాయం. కనీసం నువ్వు నామూలంగా పోగొట్టుకొన్న నీ సర్టిఫికెట్ల డూప్లికేట్లు సంపాదించుకోవడానికైనా ఈ మొత్తం ఉపయోగపడ గలిగితే కొంతకు కొంత తృప్తి. ఆశీర్వాదాల మీద కంటే నాకు శ్రమశక్తిమీద నమ్మకం ఎక్కువ. అందుకే ఆశీర్వదించడం లేదు."

"ఈ సహాయమే మీ ఆశీస్సులుగా భావిస్తాను. నేను వెళ్ళొస్తాను సార్!"

"వెళ్ళిరా బాబూ!"

అభిమన్యుడు బయలుదేరుతున్నాడు.

"బాబూ!" సౌజన్యమూర్తి పిలిచాడు.

"చెప్పండి సార్!" అంటూ అభిమన్యుడు వెనక్కుతిరిగి చూశాడు.

"నన్ను కాపలాకాయమని మళ్ళీ నువ్విక్కడ ఏమీ పెట్టిపోలేదు గదా?"

ఆ మాటతో ఆపెట్టె ముసిముసిగా నవ్వుకొనింది.

అభిమన్యుడు ఒక్కక్షణం ఆలోచించాడు వెంటనే-

"భలేవాళ్ళుసార్ మీరు! ఇంత అబద్ధం చెప్తే ఎలాసార్!"

"అబద్ధమా?"

"కాకపోతే మరేమిసార్! ఏమీ పెట్టిపోలేదని ఎంత ధైర్యంగా చెప్తున్నారు సార్!"

"ఏం పెట్టిపోతున్నావు బాబూ?" సందేహంగా అడిగాడు సౌజన్యమూర్తి.

"నా హృదయాన్నే ఇక్కడపెట్టి పోవడంలేదా సార్!"

"అమ్మో! పిడుగా కొట్టావే దెబ్బ!"

రైలు పెట్టంతా నవ్వుల్తో నిండిపోయింది.

నవ్వుతూ చేయెత్తి నమస్కరించి అభిమన్యుడు సెలవు తీసుకొన్నాడు.

సౌజన్యమూర్తి కూర్చున్నాడు. రైలు తిరుపతినుండి గూడూరు చేరేటప్పటికి కిటికీ పక్కన సీటు దొరికింది. ఇప్పుడతని హృదయం తృప్తితో తొణికిసలాడుతూ ఉంది.కొన్ని క్షణాలు మాత్రమే!_అంతలోనే బరువెక్కింది. హృదయం బరువెక్కడమంటే ఆలోచనలు తనమీద దాడిచేయడం. అందుకే మోచేతిని కిటికీకానించి అరచేత్తో నుదిటిని పట్టుకొన్నాడు.

"ఈ దేశంలో నిరుద్యోగ సమస్య యువతను పీడిస్తున్నది. ఈ సమస్యతో ఎందరో సతమతమైపోతున్నారు. మరెందరో బలైపోతున్నారు. వాళ్ళల్లో ఈ కుర్రవాడొక్కడు. వాడికి నేను చేసిన సహాయం దీర్ఘ రోగానికి తాత్కాలిక ఉపశమనం చేసినట్లే లెక్క. దీనికే తృప్తిపడడం

అల్ప సంతోషమే అవుతుంది. అయినా మనం స్వాతంత్ర్యాన్ని సాధించి మూడున్నర దశాబ్దాలకు పైబడుతూ ఉంది. అయితే ఏం సాధించినట్లు?" అని ఆలోచిస్తూ కిటికీగుండా చూస్తున్నాడు.

రైలు గూడూరు నుండి బయలుదేర పోతూ ఉంది.

సౌజన్యమూర్తి కిటికీ నుండి చూస్తూంటే కొండలు...గుట్టలు...చెట్లూ చేమలు...రైలు బాట పక్కన పచ్చని పొలాలు...వినీలాకాశాన్ని వింతవింత ఆకారాల్తో అలంకరించిన మేఘాలు ఎన్నో రమణీయంగా కనపడుతున్నాయి.

అయితే సౌజన్యమూర్తి కంటికి మాత్రం అంతా శూన్యంగా తోస్తూ ఉంది.

"అవును. ఈ మూడున్నర దశాబ్దంకాలంలో మనం సాధించింది శూన్యమే-ముఖ్యంగా విద్యా విషయంగా!_ లేకుంటే బి.ఎ., యం.ఎ, పి.హెచ్.డి. డిగ్రీలను చేతపట్టి కొంతమంది కాలేజీల నుండి బయటపడి నెత్తి మొత్తుకొంటుంటే, మరొక వైపు కాలేజీల్లో చేరడానికి సీటు దొరక్క ఎంతోమంది నోరుకొట్టుకొంటున్నారు. పి.హెచ్.డి.లు మరికొన్ని పి.హెచ్.డీలను, ఎమ్మెస్సీలు మరో వందమంది ఎమ్మెస్సీలను, ఇంజనీర్లు ఇంజనీర్లలను, తయారుచేస్తున్నారు. వ్యవసాయకళాశాలల్ని తీసుకొన్నా అంతే! అక్కడ కూడా డాక్టర్లు డాక్టర్లను తయారుచేస్తున్నారే కానీ పారపలుగుపట్టి పనిచేసే వాడొక్కడు కనిపించడు. ఈ విధానం ఇలా కొనసాగాల్సిందేనా! మనిషి తన కాళ్ళమీద తాను బతికే మార్గాన్ని చూపించే విద్యావిధానం రాదా? లేదా? ఈ దేశంలో మేధావులు ఏమయ్యారు? ఈ సమస్య వాళ్ళకు సమస్యగా తోచడంలేదా? తోస్తే పరిష్కార మార్గాలు ఆలోచించరేం? ఆలోచించనీయకుండా ఏ స్వార్థశక్తులు పనిచేస్తున్నాయ్?" అని సౌజన్యమూర్తి పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు.

రైలు నెల్లూరులో ఆగింది.

రైలు ఆగేసరికి సౌజన్యమూర్తి ఆలోచనలక్కూడా అంతరాయం కలిగింది. అతని దృష్టి ప్లాట్‌ఫారం మీదికి మళ్ళింది.

అరటిపండు తిని ఎవడో ఒకడు తొక్కను ప్లాట్‌ఫారం మీదనే వేశాడు. హడావిడిగా పోతున్న ఒకవ్యక్తి ఆతొక్కనుతొక్కి దభాలున కింద పడ్డాడు. కొందరు సహృదయులు అతనిని పట్టి పైకి లేపుతూ 'అంతవరకు మేలే! ఏమీ విరగలేదు!' అని సంతృప్తిపడుతున్నారు. ఇదంతా గమనిస్తూనే అరటిపండు తింటున్న మరొక మనిషి మళ్ళీ అదే పని చేస్తున్నాడు. అతనితో ఇంకొకతను వాదులాడుతున్నాడు. రైలెక్కేవాళ్ళు ఆతురతపడ్తున్నారు. తొందరపడ్తున్నారు దిగేవాళ్ళు. ఈ ఆతురత ఆ తొందరపాటు కలగలిసి తొక్కులాట!

ఎంతో ఎత్తుకు ఎదిగినామను కొంటున్నా ఎదగని మనస్తత్వాల్ని ఎత్తిచూపుతున్న ఆ ప్లాట్‌ఫారాన్ని ఎంతో ఆసక్తిగా కలయచూస్తున్న సౌజన్యమూర్తి ప్లాట్‌ఫారం చివర కంటపడిన దృశ్యాన్ని చూసి స్తంభించిపోయాడు. అతడు స్తంభిస్తే రైలు స్తంభిస్తుందా? అది కదిలింది. సౌజన్యమూర్తి ఆదరాబాదరా పైకిలేచి ఒక్కఊపులో తలుపు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

రైలుమెల్లగానే వేగాన్ని పుంజుకొంటూ ఉంది. తలుపుదగ్గర నిలబడి చూస్తున్నాడు. సందేహమే లేదు!

వాడే! ఆ కుర్రవాడే! తనదగ్గర సూట్‌కేస్ పోయిందని కల్లబొల్లి ఏడ్పులుయేడ్చి భిక్షమెత్తించినాడే వాడే!— వాడూ వాడిస్నేహితుడు ఇద్దరు చెరొక సూట్‌కేస్ చేత పట్టుకొని ఎదురెదురుగా నిలబడి ఎంతోహాయిగా నవ్వుకొంటున్నారు. నవ్వుకొంటూ డబ్బులు పంచుకొంటున్నారు. అందులో అంతోయింతో వాటాపుచ్చుకొన్నట్లుంది ఒక పోలీస్!— జేబులో కుక్కుకొంటూ పరుగెత్తుకొంటూ వచ్చి రైలెక్కుతున్నాడు.

సౌజన్యమూర్తి తల దిమ్మతిరిగి పోయింది!

గుండెలు పొగులుతున్నా నోటమాట పెగల్లేదు.

మౌనంగా వెళ్ళి మళ్ళీ తనసీట్లో కూర్చున్నాడు.

కూర్చున్నాడన్న మాటే కానీ, అతని మనస్సు పరిపరివిధాల పోతూఉంది. అది అలానేపోతూపోతూ ఒక్క క్షణంలో మూడున్నర దశాబ్దాలకు ముందుకువెళ్ళి ఆగింది.

అప్పుడు!...అక్కడ!...

స్వాతంత్ర్య సమరం... ఆ సమరంలో యువకుల వీరావేశం... ఆ ఆవేశానికి ప్రతి ఫలంగా లాఠీదెబ్బలు...చెరసాలలు...ఆత్మాహుతులు!— ఆస్తిపాస్థులు హారతి కర్పూరాలు..ఒక్కదినమా? రెండుదినాలా? ఒక్క ఏడా? రెండేండ్లా? కాదే! దాదాపు అరవై ఏండ్లుగా ఎందరో మహానుభావుల అవిరళ కృషిఫలితం ఈ స్వరాజ్యం!— నేటి యువత చేతిలో కోతిచేతి పూలమాల!_తల్లీ! భరతమాతా! వీళ్ళేనమ్మా నీబిడ్డలు!...

సౌజన్యమూర్తి కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి!

అక్షణంలోనే రైలు పట్టాలుతప్పిపడిపోతే... ఘోరప్రమాదం సంభవిస్తే... ఆ ప్రమాదంలో తగులుకొని చస్తే!...ఎంత బాగుండేదో?...

ఆరాటపడ్డాడు సౌజన్యమూర్తి!—

ఆవేశపడ్డాడు సహృదయ మూర్తి!!—

అయితే మనంసాధించిన ప్రగతికి నిదర్శనంగా విద్యుచ్ఛక్తితో నడుస్తున్న ఆ రైలు మరింత వేగాన్ని పుంజుకొని ముందుకు పోతూనే ఉంది! ●

పల్లకి
(15, నవంబర్ 1984)
దసరా కథల పోటీలో ప్రత్యేక బహుమతి